సాక్షి
మంచిర్యాల
సోమవారం । 30 । జనవరి । 2023





**బుద్ధుడి మార్గం.. అనుసరణీయం**

బుద్ధుడి శాంతిమార్గంలో పయనించాలని అంబేద్కర్ మనుమడు భీంరావు యశ్వంత్ అంబేద్కర్ సూచించారు. కన్కపూర్‌లో 25 అడుగుల బుద్ధ విగ్రహాన్ని ఆవిష్కరించారు. 8లో▸



**ముగిసిన నాగోబా జాతర**

ఈ నెల 21న మెస్రం వంశీయుల మహా పూజలతో ప్రారంభమైన నాగోబా జాతర ఆదివారంతో ముగిసింది. చివరిరోజు ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
33.1 /19.5

**వాతావరణం**

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా అనిపిస్తుంది. చలి బాగా తగ్గుతుంది.

## న్యూస్‌రీల్

### పరీక్షలపై అవగాహన



మాట్లాడుతున్న మధుసూదన్‌నాయక్

మంచిర్యాలటౌన్‌: పట్టణంలోని వివేకవర్ధిని డిగ్రీ కళాశాల ఆవరణలో ఎస్సీ వసతి గృహాల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్‌ మధుసూదన్‌నాయక్‌ హాజరై విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. పరీక్ష హాల్‌లో ఎలాంటి ఒత్తిడిలకు గురికావొద్దన్నారు. సందేహం వస్తే ఉపాధ్యాయులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ సబ్జెక్టుల నిపుణులతో అవగాహన కల్పించారు. షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు రవీందర్‌రెడ్డి, రవీందర్‌, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

### ఏసీపీకి సన్మానం



మహేశ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: బదిలీపై వెళ్తున్న బెల్లంపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్‌ను ఆదివారం ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బెల్లంపల్లి పోలీసు సబ్‌ డివి జన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు మహేశ్‌ ఎంతగానో కృషి చేశారని అన్నారు. సమర్థుడిగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు నారాయణ, యాదగిరి, సుభాష్‌ రావు, శ్రీనివాస్‌, శ్రీకాంత్‌, వెంకటేశ్‌ పాల్గొన్నారు.

### కరాటేలో ప్రతిభ



దండేపల్లి: హైదరాబాద్‌ జీడిమెట్లలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో మండల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కటాస్‌ విభాగంలో వినయ్‌, స్నిగ్ధ, గణేశ్‌ బంగారు పతకాలు సాధించారని పేర్కొన్నారు. సిద్దార్థ, సత్యత్రివేద్‌ వెండి పతకాలు, దీక్షిత, జి.విష్ణువర్ధన్‌ కాంస్య పతకాలు సాధించినట్లు మాస్టర్‌ బొడ్డు రాజమల్లు తెలిపారు.

# ట్యాంపర్ @ 420!

- ఉల్లంఘనులపై పోలీసుల ఉక్కుపాదం
- ట్రాఫిక్‌, సివిల్‌ పోలీసుల స్పెషల్‌ డ్రైవ్‌
- పట్టుబడితే చీటింగ్‌ కేసులు నమోదు



నంబర్‌ ప్లేట్‌పై మరో నంబర్‌ కనిపించకుండా తిరుగుతున్న వ్యక్తి

మంచిర్యాలక్రైం: ట్రాఫిక్‌ ఉల్లంఘనులపై ఉక్కుపాదం మోపేందుకు పోలీస్‌ శాఖ సిద్ధమైంది. కొంత మంది వాహనదారులు ట్రాఫిక్‌ పోలీసులకే కాదు... కెమెరాలకూ చిక్కకుండా నంబర్‌ ప్లేట్‌ ట్యాంపరింగ్‌ చేస్తున్నారు. ఎక్కడ చూసినా ఒక నంబర్‌ తక్కువ ఉండే వాహనాలు, కొన్ని నంబర్‌లేని వాహనాలు, మరికొన్ని స్టిక్కర్‌ వేసి, నంబర్‌ ప్లేట్‌ వంచిన వాహనాలు కనిపిస్తున్నాయి. పోలీసులు, కెమెరాలకు చిక్కకుండా జిమ్మిక్కులు చేస్తున్న వాహనదారుల ట్రాఫిక్‌ రూల్స్‌ ఉల్లంఘిస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరిగినప్పుడు, చోరీకి గురైన వాహనాలను గుర్తించడం పోలీసులకు ఇబ్బందిగా మారుతోంది. దీంతో ఇలాంటి వారి ఆగడాలకు కళ్లెం వేసేందుకు నంబర్‌ ప్లేట్‌ ట్యాంపరింగ్‌పై స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించాలని పోలీసులు నిర్ణయించారు. పట్టుబడిన వారిపై 420(చీటింగ్‌) కేసు నమోదు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

**స్పెషల్‌ డ్రైవ్‌ షురూ..**

రామగుండం పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలోని మంచిర్యాల ట్రాఫిక్‌, సివిల్‌ పోలీసులు నంబర్‌ ట్యాంపరింగ్‌ చేసేవారిని గుర్తించేందుకు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నారు. నంబర్‌ ప్లేట్‌పై అంకెలు కనిపించకుండా చేయడంతోపాటు ట్రాఫిక్‌ నిబంధనలు అతిక్రమించిన సదరు వాహనాలకు ఈ–చలాన్లు లేకపోవడాన్ని గుర్తిస్తున్నారు. నంబర్లు ట్యాంపరింగ్‌ చేసి ఈ–చలానాకు చిక్కకుండా తిరుగుతున్న వాహనాలు స్వాధీనం చేసుకుని యజమానులపై 420(చీటింగ్‌) సెక్షన్‌ కింద కేసులు పెడుతున్నారు.

**తప్పించుకుంటున్న నేరస్తులు..**

నంబర్‌ ప్లేట్ల ట్యాంపరింగ్‌ ద్వారా వివిధ నేరాలకు పాల్పడిన వారు తప్పించుకుంటున్నారని పోలీసులు గుర్తించారు. చైన్‌ స్నాచర్లు, బైక్‌ దొంగలు, ఇళ్లలో చోరీలకు పాల్పడేవారు ఎక్కువగా నంబర్‌ ట్యాంపరింగ్‌ చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు. అందుకే స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొంటున్నారు. దీనిద్వారా ట్రాఫిక్‌ నిబంధనలు ఉల్లంఘించే వారిని కట్టడి చేయడంతోపాటు నేరస్తులకు పట్టుకునే వీలవుతుందని చెబుతున్నారు.

**గతేడాది ట్యాంపరింగ్‌ కేసుల వివరాలు..**

| నంబర్‌ ప్లేట్‌ | కేసులు | జరిమానా(రూ.లలో) |
|---|---|---|
| చెరిపేసిన నంబర్‌ ప్లేట్‌ | 1,514 | 3,02,800 |
| ఫ్యాన్సీ నంబర్లు(జిగ్‌జాగ్‌) | 901 | 1,80,200 |
| సరికాని నంబర్‌ ప్లేట్‌ | 2,053 | 4,10,500 |

**చీటింగ్‌ కేసు పెడతాం**



నంబర్‌ ప్లేట్‌ ట్యాంపరింగ్‌కు పాల్పడితే చీటింగ్‌ కేసు నమోదు చేస్తాం. ఈ విధానం ప్రస్తుతం హైదరాబాద్‌లో అమలవుతోంది. రామగుండం పోలీస్‌ కమిషనరేట్‌లో సైతం అమలుకు ఆదేశాలు వచ్చాయి. పూర్తి నంబర్‌ కనిపించకుంటే చీటింగ్‌గానే పరిగణిస్తాం. ట్యాంపరింగ్‌కు పాల్పడే వారిలో యువకులే అధికంగా ఉన్నారు. 420 కేసు నమోదైతే వారి భవిష్యత్‌కు మంచిది కాదు.

– నరేశ్‌ కుమార్‌, ట్రాఫిక్‌ సీఐ, మంచిర్యాల

# బదిలీల్లో గందరగోళం..!

- తెలుగు సబ్జెక్టు పోస్టులో ఫిజికల్‌ సైన్స్‌ టీచర్‌తో సర్దుబాటు
- బయాలజీ సైన్స్‌ టీచర్‌కు బదిలీపై భిన్నాభిప్రాయాలు



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న తెలుగు ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్‌: తెలంగాణ ప్రభుత్వం టీచర్ల బదిలీలు, పదోన్నతులకు షెడ్యూల్‌ ప్రకటించగా, మరోవైపు జిల్లాలో ఉపాధ్యాయుల కేటాయింపు ఇష్టానుసారంగా జరుగుతోంది. స్పౌజ్‌ బదిలీలో భాగంగా జిల్లాకు వచ్చిన ఫిజికల్‌ సైన్స్‌ టీచర్‌ను ఎస్‌ఏ తెలుగు సబ్జెక్టు పోస్టులో నియమించడం వివాదాస్పదమైంది. నిబంధనల ప్రకారం ఫిజికల్‌ సైన్స్‌ టీచర్‌ ఖాళీ లేకపోతే ఎగినెస్ట్‌ పోస్టులో కేటాయించడాన్ని ఎవరూ తప్పుపట్టరు. చాలా పాఠశాలల్లో సదరు పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ జిల్లా కేంద్రంలో తెలుగు పోస్టులో సర్దుబాటు చేయడంపై తెలుగు ఉపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఇదే విషయంపై కొంతమంది తెలుగు ఉపాధ్యాయులు డీఈవో వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం సమర్పించారు. తెలుగు పోస్టులో ఫిజికల్‌ సైన్స్‌ ఉపాధ్యాయురాలిని నియమించడం వలన తాము నష్టపోతామని తెలిపారు. పోస్టులు తక్కువగా ఉన్న తెలుగు, హిందీ విషయాల్లో మరొక సబ్జెక్టును సర్దుబాటు చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, జిల్లాలో ఓ పాఠశాలలో సోషల్‌ టీచర్‌గా(ఎగినెస్ట్‌)విధులు నిర్వహిస్తున్న బయోసైన్స్‌ టీచర్‌ను పక్క మండలం నుంచి ఉన్నఫలంగా జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలకు కేటా యించారు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

**ఖాళీల్లో సర్దుబాటు చేయాలి..**

జీవో ప్రకారం.. బదిలీలు, పదోన్నతుల తర్వాత ఏర్పడిన ఖాళీల్లో ఎగినెస్ట్‌ పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను అదే సబ్జెక్టుల్లో సర్దుబాటు చేయాలి. ఈమేరకు అవకాశం ఉన్నప్పటికీ ముందస్తు బదిలీలపై ఉపాధ్యాయుల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇంకోవైపు సోషల్‌ సబ్జెక్టు పోస్టులో ఇదివరకే బయోసైన్స్‌ ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుంటే సబ్జెక్టు పోస్టు భర్తీ చేయాలనుకుంటే దూర ప్రాంతంలో పోస్టింగ్‌ ఇవ్వాలి. కానీ అధికారులు జిల్లా కేంద్రంలోనే పోస్టింగ్‌ ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. జీవో 317తో అన్యాయంగా నిర్మల్‌కు బదిలీ అయి.. అప్పీలు ద్వారా జిల్లాకు కేటాయించి 60 ఏళ్ల ఉపాధ్యాయుడిని ఒరిజినల్‌ పోస్టు ఇవ్వకుండా మారుమూల ప్రాంతానికి పంపి, యువ ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలో పోస్టింగ్‌ ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎగినెస్ట్‌ పోస్టులో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలికి పక్క మండలాల్లో ఖాళీ వేకెన్సీ ఉన్నా.. జిల్లా కేంద్రంలోని నియమించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయంపై డీఈవో వెంకటేశ్వర్లు సంప్రదించగా నిబంధనల మేరకు పాఠశాలల కేటాయింపు జరిగిందన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు పారదర్శకంగానే పోస్టులు భర్తీ చేస్తున్నామని పేర్కొన్నారు.

**తెలుగు పోస్టులో ఫిజికల్‌ సైన్స్‌ టీచర్‌ నియామకం సరికాదు**

స్కూల్‌ అసిస్టెంట్‌ తెలుగు పోస్టుకు బదులుగా ఫిజికల్‌ సైన్స్‌ స్కూల్‌ అసిస్టెంట్‌ను సర్దుబాటు చేయడం సరికాదు. భాషాపండితులకు అన్యాయం చేశారు. అసలే పోస్టులు తక్కువగా తెలుగు, హిందీ విషయాల్లో మరో సబ్జెక్టును క్యాడర్‌ స్ట్రెంత్‌గా చూపించడం బాధాకరం. విద్యాశాఖ అధికారిపై పూర్తి విశ్వాసం ఉంది. రేపటి బదిలీల్లో ఈపోస్టును ఖాళీగా చూపిస్తారని ఆశిస్తున్నాం.

– సత్యనారాయణచారి, ఆర్‌యూపీపీటీఎస్‌ జిల్లా అధ్యక్షుడు

## అమ్మ ఆగమనం



లక్ష్మీ దేవరకు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



గుట్ట నుంచి చెన్నూర్‌కు చేరుకున్న లక్ష్మీదేవర

**చెన్నూర్‌ పట్టణంలోని** బట్టిగూడెం కాలనీలో బోనాల ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని బుద్దారం అటవీ ప్రాంతంలోని లక్ష్మీదేవర గుట్ట నుంచి అమ్మవారిని ఆదివారం సాయంత్రం బాజా భజాంత్రీలతో తీసుకొచ్చారు. స్థానిక పెద్ద చెరువు రావిచెట్టు వద్ద మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారు ఆలయ ప్రవేశం చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో ఆటాపాట నిర్వహించారు. - చెన్నూర్‌

# సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌



నస్పూర్‌ షిర్కే కాలనీలో పర్యటిస్తున్న రఘునాథ్‌

నస్పూర్‌: సింగరేణి గని కార్మికులకు సీఎం కేసీఆర్‌ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌ డిమాండ్‌ చేశారు. గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నస్పూర్‌ షిర్కే కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 ఎన్నికల సమయంలో సీఎం సింగరేణి కార్మికలకు ఇచ్చిన పది వేల కొత్త కంపెనీ క్వార్టర్ల నిర్మాణం, కార్మికులకు 200 గజాల స్థలం, ఉచిత కరెంటు, వడ్డీ లేని పది లక్షల రుణం వంటి పలు హామీలు నెరవేర్చకుండా కార్మికులను మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు సత్రం రమేశ్‌, ఈర్ల సదానందం, నాయకులు కొండ వెంకటేశ్‌, రమేశ్‌, చక్రి, రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

# సాగులో భేష్‌..!

సాక్షి, మంచిర్యాలడెస్క్‌: ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా వ్యవసాయ రంగంలో ముందుంది. విభిన్న రకాల పంటల సాగు, దిగుబడితో ప్రత్యేకతను చాటుకుంటోంది. నిర్మల్‌ జిల్లా మొక్కజొన్న సాగు, దిగుబడిలో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచింది. పప్పుధాన్యాలు, పత్తి సాగులో ఆదిలాబాద్‌ జిల్లా భేష్‌ అనిపించుకుంటోంది. సోయాబీన్‌ సాగులో రాష్ట్రంలోనే ఆదిలాబాద్‌, నిర్మల్‌ జిల్లాలు మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఆదిలాబాద్‌లో 1,01,675 ఎకరాల్లో సాగు కాగా 73,900 టన్నులు, నిర్మల్‌లో 82,031 ఎకరాల్లో సాగు కాగా 47,205 టన్నుల దిగుబడి వచ్చింది. ఇక ఎలక్ట్రిక్‌ వాహనాల వినియోగంపై ప్రజలు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వాహనాల రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తే ఆ విషయం స్పష్టమవుతోంది. తెలంగాణ రాష్ట్ర స్టాటిస్టికల్‌ అబ్‌స్ట్రాక్ట్‌-2022 నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వివిధ రంగాల వారీగా పరిశీలిస్తే..



- మొక్కజొన్నలో నిర్మల్‌
- పప్పుధాన్యాల్లో ఆదిలాబాద్‌
- 'తలసరి'లో ఉమ్మడి జిల్లా వెనుకంజ
- ఎలక్ట్రిక్‌ వాహనాలపై ప్రజల దృష్టి
- రాష్ట్ర గణాంకాల నివేదికలో వెల్లడి

### మొక్కజొన్న సాగులో నిర్మల్‌ టాప్‌



చిరుధాన్యాల సాగులో నిర్మల్‌ జిల్లా ముందుంది. మొక్కజొన్న, జొన్న, సజ్జలు తదితర పంటలు సాగయ్యాయి. 2021-22 వానాకాలంలో 23,510 ఎకరాల్లో మొక్కజొన్న సాగు కాగా 59,970 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎకరాకు సగటున 25.51 క్వింటాళ్ల దిగుబడి నమోదైంది. యాసంగిలో నిర్మల్‌ జిల్లాలో మొక్కజొన్న 72,739 ఎకరాల్లో సాగు కాగా 2,71,026 టన్నుల దిగుబడి వచ్చింది. ఎకరాకు సగటున 37.26 క్వింటాళ్ల దిగుబడి రాగా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. రెండు సీజన్లలో కలిపి 96,249 ఎకరాల్లో సాగు కాగా 3,30,996 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎకరాకు సగటున 34.39 క్వింటాళ్ల దిగుబడితో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.

- ఆదిలాబాద్‌ జిల్లాలో వానాకాలం, యాసంగి సీజన్లు కలిపి 7,330 ఎకరాల్లో సాగు కాగా 13,199 టన్నుల దిగుబడి వచ్చింది. ఎకరానికి సగటున 18.01 క్వింటాళ్లు పండింది.
- మంచిర్యాల జిల్లాలో వానాకాలం, యాసంగి సీజన్లలో 2,263 ఎకరాల్లో సాగు కాగా 3,738టన్నులు, సగటున ఎకరానికి 16.52 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.
- కుమురంభీం జిల్లాలో రెండు సీజన్లు కలిపి అతి తక్కువగా 1,879 ఎకరాల్లో సాగైంది. 2,958టన్నుల దిగుబడి రాగా ఎకరానికి సగటున 15.74 క్వింటాళ్లు వచ్చింది.

### పప్పుధాన్యాల సాగులో ముందున్న ఆదిలాబాద్‌

పత్తితోపాటు పప్పుధాన్యా ల సాగులోనూ ఆదిలాబాద్‌ జిల్లా ముందుంది. 89,829 ఎకరాల్లో శనగపంట సాగు కాగా 52,821 టన్నుల దిగుబడి వచ్చింది. సగటున ఎకరాకు 5.88 క్వింటాళ్లు పండించారు.

- నిర్మల్‌ జిల్లాలో 67,775 ఎకరాల్లో శనగపంట సాగు కాగా 42,980 టన్నుల దిగుబడి రాగా, ఎకరాకు 6.34 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.



- కుమురంభీం జిల్లాలో 7,391 ఎకరాల్లో సాగు కాగా 3,989 టన్నుల దిగుబడి వచ్చింది. మంచిర్యాల జిల్లాలో అతి తక్కువగా 426 ఎకరాల్లో సాగైంది.

### వరి సాగు నామమాత్రమే..



ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ప్రధానంగా పత్తి, ఎర్రజొన్నలు, సోయాబీన్‌ తదితర పంటలకు ప్రాధాన్యం ఇవ్వగా వరి వానాకాలం, యాసంగిలో నామమాత్రంగానే సాగైంది. రెండు సీజన్లలో కలిపి మంచిర్యాల జిల్లాలో 2,25,174 ఎకరాల్లో, నిర్మల్‌ జిల్లాలో 1,75,293, కుమురంభీం జిల్లాలో 59,633 ఎకరాల్లో సాగు కాగా, ఆదిలాబాద్‌ జిల్లాలో కేవలం 2,060 ఎకరాల్లో మాత్రమే సాగు కావడం గమనార్హం.

### ఎలక్ట్రిక్‌ వాహనం రయ్‌.. రయ్‌



ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ఎలక్ట్రిక్‌ వాహనాల వినియోగం గతంతో పోల్చితే పెరిగింది. 2020-21లో ఒక్క వాహనం కూడా రిజిస్ట్రేషన్‌ కాలేదు. 2021-22లో వాహనాల సంఖ్య 739కి చేరింది. రాష్ట్రంలోని జిల్లాల్లో ఎలక్ట్రిక్‌ వాహనాల వినియోగంలో హైదరాబాద్‌ 9,161 వాహనాల రిజిస్ట్రేషన్‌లతో ప్రథమ స్థానంలో నిలువగా.. కుమురంభీం జిల్లా 34 వాహనాలతో 31వ స్థానంలో ఉంది. నిర్మల్‌ జిల్లాలో 397, ఆదిలాబాద్‌ జిల్లాలో 182 మంచిర్యాల జిల్లాలో 126 రిజిస్ట్రేషన్లు జరిగాయి. అనధికారికంగా ఈ వాహనాల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది.

**తగ్గిన వాహనాల కొనుగోళ్లు**

ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో మోటారుసైకిళ్లు, కార్లు, రవాణా వాహనాల కొనుగోళ్లు 2020-21తో పోల్చి చూస్తే 2021-22 నాటికి స్వల్పంగా తగ్గాయి. కరోనా ప్రభావం కారణంగా 2020లో వ్యక్తిగత వాహనాల కొనుగోళ్లు పెరుగగా ఆ తర్వాత తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది.

| జిల్లాలు | 2020-21 | 2021-22 |
|---|---|---|
| నిర్మల్‌ | 14,320 | 13,856 |
| మంచిర్యాల | 13,485 | 11,941 |
| ఆదిలాబాద్‌ | 11,626 | 10,107 |
| కుమురంభీం | 6,801 | 6,122 |

### ఉన్నత విద్యకు దూరం..



ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ప్రాథమికోన్నత స్థాయిలో విద్యార్థులు బడి మానేస్తుండగా.. ఉన్నత విద్యకు వచ్చేసరికి వారి శాతం పెరిగిపోతోంది. ఆదిలాబాద్‌ జిల్లాలో ప్రాథమికోన్నత స్థాయిలో 5.43 శాతం మంది, ఉన్నత విద్య స్థాయిలో 7.13శాతం విద్యార్థులు బడి మానేశారు. నిర్మల్‌ జిల్లాలో ప్రాథమిక విద్యలో 5.21శాతం, ఉన్నత విద్యలో 11.37శాతం, కుమురంభీం జిల్లాలో ప్రాథమిక విద్యలో 3.51శాతం, ఉన్నత విద్యలో 11.91శాతం, మంచిర్యాల జిల్లాలో ప్రాథమిక విద్యలో 1.62శాతం, 12.76శాతం విద్యార్థులు డ్రాపౌట్‌ ఉన్నారు.

### తలసరి ఆదాయం తక్కువే..!



ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ప్రజల వార్షిక తలసరి ఆదాయం తక్కువగానే ఉంది. 2011-12 నాటికి 2020-21 నాటికి పోల్చి చూస్తే కొంత పెరుగుదల కనిపించినా ఇంకా అట్టడుగునే ఉన్నారు. రాష్ట్రంలో వరంగల్‌ అర్బన్‌ జిల్లా అట్టడుగున ఉండగా.. ఆ తర్వాతి స్థానంలో కుమురంభీం జిల్లా ఉంది. కుమురంభీం జిల్లా ప్రజల తలసరి ఆదాయం రూ.1.31లక్షలు, ఆదిలాబాద్‌ జిల్లా రూ.1.52లక్షలు, నిర్మల్‌ జిల్లా రూ.1.51లక్షలు, మంచిర్యాల జిల్లా రూ.1.60లక్షలు ఉంది.

### తెల్లబంగారం.. ఆదిలాబాద్‌

తెల్లబంగారంగా పేరొందిన పత్తి పంట సాగులో ఆదిలాబాద్‌ జిల్లా రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచింది. 3,87,176 ఎకరాల్లో సాగు కాగా 2,09,800 టన్నుల దిగుబడి వచ్చింది. ఎకరానికి సగటున 5.42క్వింటాళ్లు పండింది. ఉమ్మడి జిల్లాలో పత్తి సాగులో కుమురంభీం జిల్లా 3,12,364 ఎకరాల్లో సాగు కాగా 1,78,744 టన్నుల దిగుబడితో రెండో స్థానంలో నిలిచింది. ఎకరానికి సగటున 5.72 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది.



- నిర్మల్‌ జిల్లాలో 1,61,998 ఎకరాల్లో పత్తి సాగైంది. 68,509 టన్నుల దిగుబడి రాగా, ఎకరానికి సగటున 4.23 క్వింటాళ్లుగా ఉంది.
- మంచిర్యాల జిల్లాలో 1,60,454 ఎకరాల్లో సాగు కాగా 83,374 టన్నుల దిగుబడి వచ్చింది. ఎకరానికి సగటున 5.20క్వింటాళ్లు పండింది.

### జనసాంద్రత ఇలా..

ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని కుమురంభీం జిల్లాలో జనసాంద్రత అత్యల్పంగా ఉంది. రాష్ట్రంలో చదరపు కిలోమీటరుకు అత్యధిక జనసాంద్రత హైదరాబాద్‌ జిల్లాలో 18,161మంది, అత్యల్పంగా ములుగు జిల్లాలో 71మంది ఉన్నారు.

| జిల్లా | జనాభా | విస్తీర్ణం | చ.కి.మీ పరిధిలో |
|---|---|---|---|
| కుమురంభీం | 5,15,812 | 4,491.28 | 115 |
| ఆదిలాబాద్‌ | 7,08,972 | 4,491.28 | 179 |
| నిర్మల్‌ | 7,09,418 | 3,731.35 | 190 |
| మంచిర్యాల | 8,07,037 | 3,908.04 | 207 |



### స్త్రీ, పురుష నిష్పత్తిలో నిర్మల్‌ టాప్‌..

స్త్రీ, పురుష నిష్పత్తిలో నిర్మల్‌ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉంది. రాష్ట్ర సగటు 988 (ప్రతి వెయ్యి మంది పురుషులకు)గా ఉండగా.. ఇక్కడ మాత్రం 1046గా నమోదైంది. కుమురంభీం, ఆదిలాబాద్‌, మంచిర్యాల జిల్లాలు వరుసగా 13, 21, 24 స్థానాల్లో ఉన్నాయి.

**జిల్లాల వారీగా..**

| జిల్లా | స్త్రీలు | పురుషులు | నిష్పత్తి |
|---|---|---|---|
| నిర్మల్‌ | 3,62,697 | 3,46,721 | 1,046 |
| కుమురంభీం | 2,57,615 | 2,58,197 | 998 |
| ఆదిలాబాద్‌ | 3,52,565 | 3,56,407 | 989 |
| మంచిర్యాల | 3,98,765 | 4,08,272 | 977 |



## క్లుప్తంగా

### శివాజీనగర్‌లో పట్టపగలే చోరీ

లక్సెట్టిపేట: పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో ఆదివారం పట్టపగలే చోరీ జరిగింది. కాలనీకి చెందిన శాంత అనే మహిళ ఉదయం ఇంటికి తాళం వేసి కూలి పనికి వెళ్లింది. గమనించిన దొంగలు ఇంటి వెనుక ఉన్న గోడదూకి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తాళం పగులగొట్టి అందులోంచి సుమారు మూడుతులాల బంగారం, రూ.40 వేలు ఎత్తుకెళ్లారు. సాయంత్రం మహిళ ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి, తలుపులు తెరిచి ఉన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆసిఫాబాద్‌రూరల్: పేకాటాడితే కఠిన చర్యలు తప్పవాని టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని చిర్రకుంట గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1590, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జైపూర్(చెన్నూర్): ఈ నెల 17న మండలంలోని ఇందారం సమీపంలో రాజీవ్ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అపస్మారకస్థితిలో పడిఉన్న గుర్తు తెలియని వ్యక్తిని గమనించిన స్థానికులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా ఆదివారం పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఇందారం సర్పంచ్ గడ్డం మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతుడు 65 నుంచి 70 సంవత్సరాలు, 5.5 అడుగుల ఎత్తు, తెలుపురంగు షర్టు ధరించి ఉన్నాడు. మృతుని ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

### రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


రామస్వామి (ఫైల్)

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. మందమర్రి పట్టణంలోని దీపక్‌నగర్‌కు చెందిన శెట్టియార్ పెరియర్ స్వామి, కుమారి దంపతుల కుమారుడు రామస్వామి (36) మంచిర్యాల పట్టణంలోని హమాలివాడలో ఎనిమిదేళ్లపాటు ఓ మహిళతో సహజీవనం చేశాడు. ఆర్నెళ్ల క్రితం సదరు మహిళ అతన్ని వదిలి పెట్టి వెళ్లిపోయింది. అప్పటి నుంచి రామస్వామి మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయాడు. ఆదివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

### వేతనాలు చెల్లించాలి

పాతమంచిర్యాల: గిరిజన హాస్టల్ వర్కర్ల పెండింగ్ వేతనాలు జీవో 60ప్రకారం ఏరియర్స్‌తో సహా చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డైలీ వైస్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, యూనియన్ నాయకులు రాజన్న, అరుణ, వజ్రమ్మ, ప్రేమ్‌కుమార్, మహేష్, రాజ్‌కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

# మైనార్టీ గురుకులంలో ప్రవేశాలు



మంచిర్యాలలోని మైనార్టీ గురుకుల పాఠశాల

- నేటితో ఆన్‌లైన్ నమోదుకు గడువు పూర్తి
- 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రవేశాలు
- లక్కీడ్రా ద్వారా సీట్ల కేటాయింపు
- దరఖాస్తు గడువు పెంచే అవకాశం!

మంచిర్యాలటౌన్: మైనార్టీ గురుకుల విద్యాలయాల్లో 2023–24 విద్యాసంవత్సరానికి ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రవేశాల కోసం మైనార్టీ సంక్షేమ శాఖ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు నేటితో గడువు ముగియనుంది. నాణ్యమైన విద్య, చక్కటి వసతి, భవితకు మార్గనిర్దేశనం చేసేలా ఏర్పాటు చేసిన మైనార్టీ గురుకులాల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన, విశాలమైన తరగతిగదులు, యోగా, క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. దీంతో మైనార్టీ గురుకులాల్లో చేరేందుకు ఏటా విద్యార్థుల నుంచి పోటీ ఎక్కువగానే ఉంటోంది.

**ఉమ్మడి జిల్లాలో 17 గురుకులాలు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 మైనార్టీ గురుకులాలు ఉండగా అందులో 10 బాలురు, 7 బాలికల విద్యాలయాలు ఉన్నాయి. మైనార్టీ గురుకులాల్లో ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా www.tmreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో తరగతిలో 80 సీట్లను కేటాయించారు. ఇందులో ముస్లింలకు 51, క్రిస్టియన్లకు 5, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, బీసీలకు 10, ఓసీలకు 2, జైనులు, పార్శీలు, బౌద్ధులు, సిక్కులకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించారు. ఐదో తరగతిలో 80 సీట్లు ఉండగా మిగతా తరగతుల్లో ఉండే ఖాళీ సీట్ల ఆధారంగా కేటాయింపు చేస్తారు. ఆసక్తి గల విద్యార్థులు ఆధార్ కార్డు, పాస్ ఫొటోలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటి వరకు ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించగా ఈ ఏడాది లక్కీడ్రా ద్వారా సీట్ల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలలోపు ఉండాలి.

**ఉమ్మడి జిల్లాలో మైనార్టీ గురుకుల విద్యాలయాలు**

| జిల్లా | పాఠశాల/కళాశాలలు |
|---|---|
| ఆదిలాబాద్ | 6 |
| నిర్మల్ | 5 |
| కుమురంభీం | 3 |
| మంచిర్యాల | 3 |
| మొత్తం | 17 |

దరఖాస్తులకు చివరి తేదీ : 30-01-2023

సర్టిఫికెట్ల పరిశీలన, ప్రవేశాలు ఏప్రిల్ 24 నుంచి 29 వరకు (ఐదో తరగతి, 6, 7, 8 బ్యాక్‌లాగ్ ఖాళీల కొరకు)

ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలు మే 1 నుంచి 10 వరకు

**సద్వినియోగం చేసుకోవాలి**



మైనార్టీ గురుకులాల్లో ఐదోతరగతి నుంచి ఇంటర్ వరకు ప్రవేశం కల్పించేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని గురుకులాల్లో చేరాలి. నాణ్యమైన భోజనంతో పాటు, ఉత్తమమైన విద్యను అందిస్తున్నాం. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి లక్కీడ్రా ద్వారా సీట్ల కేటాయింపు జరుగుతుంది.

– నీరటి రాజేశ్వరి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి

# వైఎస్సార్ పాలన తిరిగి తెచ్చేలా పనిచేయాలి

- కార్యకర్తలను నాయకులుగా తయారుచేస్తాం
- బీఆర్ఎస్ ప్రభుత్వానికి వీఆర్ఎస్ తప్పదు
- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర కార్యాచరణ కమిటీ సభ్యుడు రాంచంద్రారావు


మాట్లాడుతున్న గట్టు రాంచంద్రారావు


సమావేశానికి హాజరైన పార్టీ ముఖ్య నాయకులు

కైలాస్‌నగర్: తెలంగాణలో వైఎస్ రాజశేఖరరెడ్డి అందించిన సుపరిపాలన తిరిగి రావాలంటే వైఎస్ షర్మిలను సీఎం చేసే దిశగా ప్రతీ కార్యకర్త పార్టీ నిర్మాణం కోసం బాధ్యతతో పనిచేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర కార్యాచరణ కమిటీ సభ్యుడు గట్టు రాంచంద్రారావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న తమ అధినేత్రి షర్మిలను రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. మహిళ అని కూడా చూడకుండా దాడి చేస్తుందన్నారు. అరెస్టులు, దిగ్బంధంతో పాటు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా వాహనంలో ఉంచి లాక్కెళ్లారన్నారు. గతంలో మానుకోటలో వైఎస్ జగన్‌పై దాడి చేస్తే ఆయన ఏపీ సీఎం అయ్యారన్నారు. నర్సంపేటలో షర్మిలపై కూడా దాడి చేశారని ఆమె కూడా తెలంగాణ సీఎం ఖావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించక, పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 11మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని ఇందుకు కేసీఆరే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ బెజ్జంకి అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యాచరణ కమిటీ సభ్యులు నీలం రమేష్, శాంతికుమార్, నాగారాజు, కవిత, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల అధ్యక్షులు పెందూర్ మనోహర్, దుర్గం నగేష్, గోవింద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.


పూజల కోసం క్యూలో నిల్చున్న భక్తులు


రంగుల రాట్నాల వద్ద యువకుల సందడి

# ముగిసిన నాగోబా జాతర

- చివరి రోజు తరలివచ్చిన భక్తులు
- నేడు నాగోబా ఆలయ హుండీ లెక్కింపు

ఇంద్రవెల్లి: ఈ నెల 21న మెస్రం వంశీయుల మహాపూజలతో ప్రారంభమైన నాగోబా జాతర ఆదివారంతో ముగిసింది. ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో ఏర్పాటు చేసిన రంగుల రాట్నాల వద్ద యువతి, యువకులతో సందడిగా మారింది. జాతరలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాల వద్ద ఇంటికి కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేసి తీసుకెళ్లారు. నాగోబా ఆలయ హుండీ లెక్కింపును సోమవారం దేవాదాయ శాఖ, ఐటీడీఏ, మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో లెక్కించనున్నట్లు ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు.

### శతాధిక వృద్ధురాలు మృతి


బేతి హనుమమ్మ(ఫైల్)

నస్పూర్(మంచిర్యాల): పట్టణ పరిధిలోని నస్పూర్ కాలనీలో శతాధిక వృద్ధురాలు మృతి చెందింది. కాలనీలో నివాసం ఉంటే బేతి హనుమమ్మ (108) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలు తొలితరం తెలంగాణ ఉద్యమం (1969)లో పాల్గొన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ఐదుగురు కుమారులు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

### అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ట్రాలీ


డివైడర్‌ను ఢీకొట్టిన ట్రాలీ

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండల కేంద్రంలోని బీట్‌బజార్‌లో టాటా ట్రాలీ వాహనం డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం అంబేడ్కర్ చౌరస్తా నుంచి బస్టాండు వైపు వెళ్తున్న ట్రాలీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఘటనలో అందులో ప్రయాణిస్తున్న 12 మంది కూలీలకు స్వల్పంగా నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు నస్పూర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



నస్పూర్: నస్పూర్ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌పై సొంతపార్టీకి చెందిన పలువురు కౌన్సిలర్లు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతారనే ఊహాగానాల నేపథ్యంలో నేటి సమావేశం పట్ల ఆసక్తి నెలకొంది. వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు సమావేశమై అవిశ్వాసం సాధ్యాసాధ్యాలపై చర్చించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు వేర్వేరుగా వారితో సమావేశమైనట్లు సమాచారం.

### ప్రజా సమస్యలపై పోరాడాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్


మాట్లాడుతున్న లక్ష్మణ్

రామకృష్ణాపూర్: ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సీపీఐ చెన్నూర్ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు. చెన్నూర్, భీమారంలో పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా పోరాటాలు నిర్మించాలని, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఇప్పకాయల లింగయ్య, సుదర్శన్, మిట్టపెల్లి శ్రీనివాస్, మిట్టపెల్లి పౌల్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# మామిడిలో టెంకపురుగు నివారణకు చర్యలు


తిరుపతి, హెచ్‌వో

- పూత, పిందె దశలో ఆశించడంతో భారీ నష్టం
- జాగ్రత్తలు పాటిస్తే మేలు

చెన్నూర్‌రూరల్: మామిడి అన్నింటిలో కంటే ప్రధాన పంట. ఏడాదికి ఒక్కసారి మాత్రమే దిగుబడిని ఇచ్చే పంట. మామిడి పంటను అనేక రకాల కీటకాలు ఆశించి దెబ్బ తీస్తుంటాయి. పూత, పిందె దశలో ఆశించే టెంక పురుగులు భారీగా నష్టం కలిగిస్తాయి. టెంక పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై హెచ్‌వో తిరుపతి పలు సూచనలు, సలహాలు అందించారు.

**టెంక పురుగు జీవన విధానం**

టెంక పురుగులను ముట్టె పురుగులు అనికూడా అంటారు. వీటి తల్లి పురుగులు, పెద్ద పురుగులు గోధుమ రంగు, కొంచెం నలుపురంగులో దృఢంగా ఉంటాయి. మామిడి కాయలు నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు తల్లి పురుగు కాయ చర్మంపై రంధ్రం చేసి గుడ్లు పెడుతుంది. గుడ్లు కిందకు జారి పడకుండా కొంత జిగురు పదార్థంతో కాయలపై అంటుకొని ఉండేలా జాగ్రత్త పడుతుంది. ఈ గుడ్ల నుంచి విడుదలైన పిల్ల పురుగులు లేత పసుపు రంగులో ఉండి ముదురు రంగులో లేదా నల్లని తలతో ఉంటాయి. ఇవి కాయలోనికి చొచ్చుకొని పోయి కండ ద్వారా టెంకలోనికి ప్రవేశిస్తాయి. ఆ తరువాత బీజాలను, కణ జాలం తింటూ వృద్ధి చెందుతాయి. ఈ దశలో కాయ వృద్ధి చెందే కొద్దీ కాయకు ఉన్న రంధ్రం మూసుకుపోయి పురుగులు ఉన్నట్లు ఎవరికీ కనిపించదు. బీజాల చుట్టూ టెంక వృద్ధి చెందుతుంది. టెంకలోకి చేరిన పురుగులు అక్కడే తింటూ కోశస్థ దశ అంతా టెంకలోనే పూర్తి చేసుకుంటాయి. పిల్ల పురుగు దశ నుంచి తల్లి పురుగుగా వృద్ధి చెందడానికి 40 నుంచి 50 రోజుల సమయం పడుతుంది. ఈ పురుగులు టెంక లోపలి గుజ్జును తినడం వల్ల కాయలు వృద్ధి చెందవు. కాయ పక్వానికి రాకుండా పండువారి ఆతర్వాత రాలి పోతుంది. కాయపై రంధ్రాలు చేసుకుని వెలుపలకు వచ్చి నేలపై పడి చెట్టు కాండం బెరడు సందుల్లో నెలల తరబడి జీవిస్తాయి. తద్వారా కాయలపై పెద్ద రంధ్రం ఏర్పడుతుంది.

**నివారణ చర్యలు**

టెంక పురుగు ఆశించిన టెంకలు విత్తనానికి పనికి రావు. రాలిన పండ్లు ఎప్పటికప్పుడు ఏరి కాల్చడం వల్ల అందులోని లద్దె పురుగు ఇతర దశలు నాశనమవుతాయి. ఈ విధంగా మూడు సంవత్సరాలు పురుగును వెతికి నాశనం చేయాలి. తోటల చుట్టుపక్కల మామిడి టెంకలు వేయకుండా జాగ్రత్త పడాలి. టెంకలను ఎండబెట్టి తరువాత పారవేయడం వల్ల లోపలి పురుగులు చనిపోవడంతో ఆతర్వాత సంవత్సరం వీటి ఉధృతి తగ్గుతుంది. కాయలు కోసిన తర్వాత చెట్టు చుట్టూ లోతుగా మట్టి తవ్వి బయట పోస్తే కోశస్థ దశలో ఉన్న పురుగులు ఎండి చనిపోతాయి. పిందె నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు 1 మిల్లీలీటరు డెల్టామైత్రిన్ లేదా 2.5 మిల్లీ లీటర్లు క్లోరోఫైరిపాస్ లేదా 2 మిల్లీ లీటర్ల లెబాసిత్‌ను లీటరు నీటికి కలిపి మూడు వారాల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే టెంక పురుగును నివారించవచ్చు.

# శిథిలావస్థలో కడెం కెనాల్ వంతెన


శిథిలమైన రక్షణ దిమ్మెలు


వంతెన కింది భాగంలో రాడ్లు తేలిన దృశ్యం

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని కర్ణపేట సమీపంలో కడెం ప్రధాన కాల్వ దాటేందుకు నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. కాల్వ నిర్మాణ సమయంలో నిర్మించిన వంతెనకు అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో వంతెన మరింత శిథిలంగా మారింది. కెనాల్ అవతలి వైపు రైతుల పంట పొలాలు, పండ్ల తోటలు, ఊట్ల, పెండ్లిమడుగు, సామగూడెం, తదితర గిరిజన గ్రామాలు ఉన్నాయి. దట్టమైన అడవిలో పెద్దయ్య దేవుడి ఆలయం ఉంది. దీంతో నిత్యం వంతెన మీదుగా అనేక వాహనాలు వెళ్తుంటాయి. వంతెన ఇరుకుగా, ఉండడంతో పాటు, శిథిలావస్థకు చేరడంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

# బుద్ధుడి మార్గం అనుసరణీయం

- అంబేడ్కర్ మనుమడు భీంరావు యశ్వంత్ అంబేడ్కర్
- 25 అడుగుల బుద్ధుడి విగ్రహం ఆవిష్కరణ


మాట్లాడుతున్న యశ్వంత్


బుద్ధుడి విగ్రహం వద్ద అంబేడ్కర్ మనుమడు భీంరావు యశ్వంత్

లోకేశ్వరం(ముధోల్): ప్రపంచ యుద్ధాలకు బదులుగా బుద్ధుడు చూపిన శాంతి మార్గంలో దేశాలు పయనించాలని బీఎస్ఐ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, అంబేడ్కర్ మనుమడు భీంరావు యశ్వంత్ అంబేడ్కర్ అన్నారు. ఆదివారం మండలంలోని కన్కపూర్ గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 25 అడుగుల బుద్ధ భగవాన్ మూర్తి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోనే రెండోవది కన్కపూర్ గ్రామంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ బుద్ధుడు బోధించిన వైజ్ఞానిక మార్గాన్ని అనుసరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బుద్ధవిహార్‌లకు నిధులు, స్థలాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, పూజ్య భదంత్ సంఘపాల్‌జీ, మహాథేరో పూజ్య భదంత్ దీపాంకర్‌జీ, బీఎస్ఐ తెలంగాణ అధ్యక్షుడు ప్రభాకర్ గడపాలే, నిర్మల్ జిల్లా బీఎస్ఐ ప్రధాన కార్యదర్శి కొంతం మురళీధర్, మెంబర్ ఆఫ్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సమత సుదర్శన్, ఏవైఏ అధ్యక్షుడు మోడం శంకర్, సర్పంచ్ సాలాయ నరేశ్, బీఎస్ఐ మండల అధ్యక్షుడు దిలీప్ కదం, వీడీసీ చైర్మన్ సునీల్ సిందే, తదితరులు పాల్గొన్నారు.




చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 38 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. పట్టణంలోని సేజ్ స్కూల్ వేదికగా కలుసుకున్న తామంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకున్నారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పులి చంద్రశేఖర్, నసీర్, నాందేవ్, గాదె రాజు, ఓంకార్, మోహన్, పబ్బా భాస్కర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# బాసరలో భక్తుల రద్దీ

భైంసా(ముధోల్): బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. గోదావరినదిలో పుణ్యస్నానం ఆచరించిన భక్తులు గంగమ్మతల్లికి పూజలు చేశారు. అనంతరం సూర్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. నిత్యహారతిఘాట్‌లో నిర్వహించిన హోమపూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి సన్నిధిలో తమ చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేయించారు. కుటుంబసమేతంగా బోటింగ్‌లో విహరిస్తూ ఉల్లాసంగా గడిపారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు